ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 5 ఫిబ్రవరి 2025




కేటాయింపులకు నోచుకోనివి..

- డోర్నకల్-మిర్యాలగూడ, డోర్నకల్- గద్వాల్ వరకు కొత్త లైన్లు
- హసన్‌పర్తి- కరీంనగర్ మధ్య 62కి.మీల లైన్
- రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు కోల్‌రైల్
- కాజీపేట-భూపాలపల్లి నూతన మార్గం
- కాజీపేట- సికింద్రాబాద్ మూడో లైన్ నిర్మాణం

'అమృత్'కు ఎంపికైన స్టేషన్లు..	కాజీపేట, వరంగల్, జనగామ, మహబూబాబాద్

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తద్వారా ఇక్కడ మల్టిపుల్ రైల్వే మ్యాను ఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించనున్నారు.

కొత్త లైన్లకు రెడ్ సిగ్నల్



- రైల్వే బడ్జెట్‌లో పట్టాలెక్కని ఓరుగల్లు రైలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు కొత్త మార్గాల ఊసెత్తని కేంద్రం
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి సానుకూలత
- అమృత్ స్టేషన్ పథకానికి పలు రైల్వేస్టేషన్ల ఎంపిక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బడ్జెట్‌లో ఓరుగల్లు రైలుకు రెడ్‌సిగ్నలే ఎదురైంది. రైల్వేశాఖ కొత్త మార్గాల ఊసే ఎత్తలేదు. కాజీపేట, డోర్నకల్ జంక్షన్ల నుంచి పలు ప్రాంతాలకు కొత్త లైన్లతో పాటు కోల్ రైల్ కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. డోర్నకల్ నుంచి మిర్యాలగూడ, డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు నిర్మించాల్సిన కొత్త లైన్లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. 62కిలోమీటర్ల హసన్‌పర్తి-కరీంనగర్ మార్గానికి రైల్వేబోర్డు క్లియరెన్స్ ఇవ్వకపోగా, కాజీపేట- భూపాలపల్లి, రామగుండం నుంచి భూపాలపల్లి, మేడారం మీదుగా మణుగూరు వరకు నిర్మించాలని ప్రతిపాదించిన కోల్ రైల్ ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు చేయలేదు. దీంతో ఓరుగల్లువాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కాజీపేటతో పాటు మరో నాలుగు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు గాను అమృత్‌స్టేషన్ల పథకం కింద ఎంపిక చేయగా, రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి సానుకూల ప్రకటన చేయటం కొంత ఊరటనిస్తోంది. అయితే అతికీలకమైన కాజీపేట టు సికింద్రాబాద్ మధ్య మూడో లైన్‌కు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పెండింగ్‌లో పలు ప్రతిపాదనలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలు ప్రాంతాలకు కొత్త రైల్వే లైన్ల కోసం చేసిన ప్రతిపాదనలు పెండింగ్‌లో పెట్టారు. గత శనివారం ప్రకటించిన బడ్జెట్‌తో అప్పటి వరకు రైల్వేశాఖపై ఓరుగల్లువాసులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు మూడో లైన్ నిర్మించాలని 2018లోనే రైల్వేబోర్డుకు నివేదికలు వెళ్లాయి. ఈ లైన్‌కు మంత్రి వర్గం ఆమోదం కూడా ఇచ్చింది. అయితే ఈ బడ్జెట్‌లో మూడో లైన్‌కు నిధులు కేటాయింపులు లేకపోవటంపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అలాగే కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు చేశారు. ఆ ఫైల్ కూడా రైల్వేబోర్డు వద్దే ఫైల్ పెండింగ్‌లో ఉందని, దాంతో గ్రీన్‌సిగ్నల్ రావటం లేదనే చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ లైన్ కోసం రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ లైన్ కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ

మిగతా 7వ పేజీలో...



కోల్ రైల్ కూత పెట్టేదెప్పుడో?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే రూట్‌లేని జిల్లాలు భూపాలపల్లి, ములుగు మాత్రమే. ఈ రెండు జిల్లాలకు రైల్వేలైన్ లేకపోవటంతో కొత్త లైన్లను ఏర్పాటు చేసేందుకు కొన్ని దశాబ్దాలుగా కసరత్తు జరుగుతోంది. కోల్ కారిడార్‌గా రామగుండ నుంచి మణుగూరు వరకు రైల్వే లైన్ నిర్మాణం చేయాలని 2013-14లో నిర్ణయించారు. 2023-24లో రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలో మీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే సర్వేల కోసం రెండు విడతల్లో రూ.15కోట్లు నిధులు బడ్జెట్‌లో కేటాయించారు. మట్టి సేకరణ, పరీక్షలు పూర్తి చేసిన అధికారులు, రూట్ మ్యాప్‌తో పాటు భూసేకరణ, స్టేషన్లు తదితర వాటితో డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే బొగ్గు రవాణాతో పాటు మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు రైల్ కనెక్టివిటీ పెరగనుంది. అలాగే మునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు కూడా వచ్చే పర్యాటకులకు కూడా రైల్ సౌకర్యం ఏర్పడనుంది. ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేకపోవటంపై గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ బడ్జెట్‌లో భూపాలపల్లికి రైల్వే కలసాకారం అవుతుందని భావించనప్పటికి నిరాశే మిగిలింది. దీంతో గిరిజన జిల్లాలైన ములుగు, భూపాలపల్లిలకు రైల్‌కనెక్టివిటి కలగానే మిగిలి పోతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలి

ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామాల్లో విస్తృతపరచాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ఆశాడే సందర్భంగా రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు ములుగులో అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజల్లో ఉన్న ఆందోళన, అనుమానాలను నివృత్తిచేస్తూ ప్రభుత్వ వైద్యసేవలు వినియోగించుకునేలా ఆశా కార్యకర్తలు దిశానిర్దేశం చేయాలన్నారు. జాతీయ మాతా, శిశు సంరక్షణ, పోషకాహార కార్యక్రమంలో భాగంగా గర్భిణుల నమోదు, వైద్యపరీక్షలు చేయించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా ప్రతీ ఆశా కార్యకర్త పది తెమడ పరీక్షలు చేయించి క్షయవ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స అందించాలన్నారు.

ఈనెల చివరికల్లా అసంక్రమిక వ్యాధులైన హైపర్‌టెన్షన్, మధుమేహం స్ర్కీనింగ్ పరీక్షలు వందశాతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు పవన్‌కుమార్, ప్రసాద్, నాగఅన్వేష్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు, ఎంసీహెచ్ ప్రోగ్రాం మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు, అసంక్రమిక వ్యాధుల కోఆర్డినేటర్ భూపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన పోలీస్ క్రీడలు

పాల్గొన్న జిల్లా జడ్జి, ఎస్పీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో మంగళవారం రెండో రోజు పోలీస్ క్రీడలు కొనసాగాయి. జిల్లా జడ్జీ టీమ్, జెన్‌కో, ఫారెస్ట్, సింగరేణి, అడ్వకేట్స్, స్పెషల్‌పార్టీ పోలీస్, భూపాలపల్లి పోలీస్‌టీమ్‌లు పోటీల్లో తలబడ్డాయి. ఈ టీమ్‌లలో జెన్‌కో, సింగరేణి, స్పెషల్‌పార్టీ టీమ్‌లు రాణించాయి. రెండో రోజుపోటీల్లో జిల్లా జడ్జి నారాయణ బాబు, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే, జెన్కో చీఫ్ ఇంజనీర్ సీహెచ్ ప్రకాష్, న్యాయమూర్తిలు జయరాంరెడ్డి, రాంచంద్రారావు, అఖిల పాల్గొని వారి విభాగం క్రీడాకారులను ఉత్సాహపరిచారు. భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి రన్నింగ్ కామెంట్ చేస్తూ క్రీడాకారులను ఉత్తేజ పరిచగా ఆయన చేసిన కామెంట్రీ క్రీడాకారులను వీక్షకులను ఆకట్టుకుంది.

క్రికెట్ రెండో మ్యాచ్‌లో చిట్యాల పోలీస్, మహముత్తారం సివిలియన్ టీమ్ పోటీ పడ్డాయి. మహముత్తారం టీమ్‌లోని ఓ యువకుడికి క్యాచ్ పట్టే క్రమంలో రెండు వేళ్ల మధ్యలో బాల్ బలంగా తాకడంతో రక్తస్రావమవడంతో ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారు.



రెండో రోజూ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా జడ్జి నారాయణబాబు, ఎస్పీ కిరణ్‌ఖరే, ఇతర అధికారులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


- డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్
- వైద్యుడికి మెమో జారీ



ఆస్పత్రిలోని వైద్యుడితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

వాజేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలలో విధులు నిర్వహించే వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు కోరం క్రాంతి కుమార్ హెచ్చరించారు. మంగళవారం వాజేడు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం పత్రికలలో ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై వచ్చిన కథనాలకు ఆయన స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యుడికి మెమో జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వైద్యులు కచ్చితంగా ఆస్పత్రిలో ఉండి సేవలు అందించారు. ఇద్దరు డాక్టర్లున్న నేపథ్యంలో ఒక డాక్టరు వచ్చిన తరువాతనే మరొక డాక్టరు రిలీవ్ అవ్వాలని ఆయన వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రిజిష్టర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆశా డే మీటింగ్‌లో పాల్గొని గ్రామాలలో మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి నెలసరి మందులు అందుతున్నాయో లేదా అని ఆరా తీశారు. ఈ నెలలో నులిపురుగుల నివారణ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో 1-19 ఏళ్లలోపు పిల్లల వివరాలను నమోదు చేయాలని ఆశాలకు సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి మహేందర్, హెచ్ఎస్ కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల అమాయకత్వమే ఆసరాగా..



- స్థాయికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు
- అవసరం లేకున్నా ప్రైవేటుకు సిఫార్సు.. కమీషన్ల వసూలు
- పల్లెలపై కరువైన వైద్యఆరోగ్యశాఖ నిఘా
- వ్యాపారంగా మారిన వైద్యం

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదల అమాయకత్వం, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు కొందరు ఆర్ఎంపీలు. అత్యవసర పరిస్థితుల్లో తమను ఆశ్రయించిన వారికి కొందరు స్థాయికి మించి వైద్యం అందిస్తుండగా.. మరికొందరు కమీషన్లకు కక్కుర్తిపడి ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీల ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. వారి చెప్పిందే వేదంగా భావిస్తున్న అమాయకులు అన్ని రకాలుగా మోసపోతున్నారు. ఇక వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడమో.. లేదా మామూలుగా తీసుకోవడమో గానీ ఆర్ఎంపీలంతా వైద్యులుగా చలామణి అవుతూ ఇష్టానుసారంగా వైద్య సేవలందిస్తున్నారు.

తప్పని పరిస్థితుల్లో..

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సెంటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో ప్రజలు తప్పని పరిస్థితుల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖర్చు భరించే స్థోమత లేనివారు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అయితే, వీరిలో కొంత మంది ఆర్ఎంపీలు మాత్రమే ప్రాథమిక చికిత్స అందిస్తుండగా.. చాలా మంది ఆర్ఎంపీలు చిన్నపాటి సమస్యలకు కూడా పెద్దవిగా చూపుతూ స్థాయికి మించి చికిత్సలు చేస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నా.. వైద్యం మాత్రం పూర్తి స్థాయిలో అందడంలేదనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించకపోవడం, వచ్చిన రోగులకు సరైన వైద్యం చేయకపోవడంతో నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంత రోగులు ఆర్ఎంపీలు వేసే వలలో పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

కమీషన్లపైనే కన్ను ?

ఆర్ఎంపీల వద్దకు వచ్చే పేద ప్రజలను ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టిస్తున్నారు. ఒక్కో పేషంట్‌ను ప్రైవేటు ఆసుపత్రికి పంపిస్తే ఆ ఆసుపత్రుల్లో అయ్యే బిల్లులో పర్సంటేజీలు (కమీషన్లు) ఇస్తామని పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు బహిరంగంగానే హామీలు ఇస్తుండటంతో ఆర్ఎంపీలంతా ఆ వైపుగా మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో భూపాలపల్లి మండలానికి సంబంధించిన ఆర్ఎంపీ వద్దకు ఓ బాధితుడు ఛాతిలో నొప్పి ఉందని వెళితే.. హన్మకొండ సమీపంలోని ఓ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిసింది. ఫలితంగా ఆ ఆర్ఎంపీకి ఆ ఆసుపత్రి నిర్వాహకులు రూ.5,200 నగదును షీల్డ్ కవర్‌లో పెట్టి వారివారి సిబ్బందిచే స్వయంగా ఇంటికి వెళ్లి అప్పగించినట్లు సమాచారం. ఇలా నెలలో కనీసం ఒక్కో ఆర్ఎంపీ రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు కమీషన్లు దండుకుంటున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా మెడికల్ షాపులు..

గ్రామాల్లో మెడికల్ షాపులు సైతం నానాటికి పెరిగిపోతున్నాయి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా మెడికల్ షాపుల నిర్వహణ కొనసాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి మెడికల్ షాపు నిర్వహించాలంటే ఫార్మసిస్టు ఉండాలి. వైద్యుల ప్రిస్క్రిప్షన్‌కు అనుగుణంగా మందులు ఇవ్వాలి. ఏమేమి

మిగతా 8వ పేజీలో...

వనదేవతల గుడుల్లో నేడు శుద్ధి పండుగ

12వ తేదీ నుంచి 15 వరకు మినీజాతర



మేడారంలోని సమ్మక్క, సారలమ్మ గద్దెలు

వివరాలు 7వ పేజీలో..

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- కాళేశ్వరం కుంభాభిషేకం ఏర్పాట్లపై సమీక్ష



భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 7,8,9 తేదీలో నిర్వహించనున్న కుంభాభిషేకం మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి కుంభాభిషేకం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరంలో ప్రతీరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని భక్తులకు తాగునీటి వసతులు కల్పించాలన్నారు. మహదేవ్‌పూర్ నుంచి కాళేశ్వరం వరకు రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలన్నారు. అన్ని సదుపాయలతో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈనెల 9న కుంభాభిషేకం నిర్వహించడానికి పీఠాధిపతులు, వేదపండితులు, వీజీపీలు గోపురాలపైకి వెళ్లే సమయంలో భక్తుల రద్దీ లేకుండా చూడాలన్నారు. గోదావరి వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని, భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కుంభాభిషేకంనకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. కాళేశ్వరంలో 3రోజుల పాటు 24 గంటలపాటు నిరంతర విద్యుత్ అందించాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఇసుకలారీలను నియంత్రించాలని తెలిపారు. భక్తులకు అన్నదానం, విధులు నిర్వహించే సిబ్బందికి వాలంటీర్లకు భోజన వసతి కల్పించాలని దేవాలయ అధికారులను ఆదేశించారు.

హైదారాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడిన దేవాదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కుంభాభిషేకం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీవో నారాయణరావు, విద్యుత్ ఎస్ఈ మల్హార్ నాయక్, డీఎంహెచ్‌వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌ల నిర్వాహకులకు నోటీసులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన యజమానులకు మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ నోటీసులు జారీ చేశారు. జనవరి 31న ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ స్పందించారు. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణంలో అనుమతి లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన యజమానులకు నోటీసు లు జారీ చేశామన్నారు.

వారు ఏర్పాటు చేసిన కొలతల ప్రకారం బిల్లులు చెల్లించి రశీదు తీసుకుని అనుమతి పొందాలని ఆయన సూచించారు. అలాగే పట్టణంలో ఇదివరకే 7 హోర్డింగ్‌లకు అనుమ తులు ఉన్నట్లు తెలిపారు.

శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా సత్యవతి రాథోడ్- 6లో



రేఖ్యతండాలో దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న ఝాన్సీ రెడ్డి

దుర్గామాత ఆశీస్సులతో సంక్షేమం

కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి

పెద్దవంగర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత ఆశీస్సులతో అన్ని విధాలా సంక్షేమం చేకురుతుందని, ప్రజల సుభిక్షం కోసమే గ్రామ దేవతలను పూజించినట్లు పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. మండలంలోని పోచారం జీపీ పరిధిలోని రేఖ్యతండాలో దుర్గామాత వేడుకల్లో పాల్గొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సంస్కృతి సంప్రదాయాలకు పెద్ద పీటవేస్తూ దేవాలయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సంవృద్ధిగా వర్షాలు పడి పాడిపంటలు బాగుండాలని గ్రామదేవతలను పూజించటం మన సంస్కృతి అని ఆమె అన్నారు. కాగా, గ్రామంలో ఉదయం ఇంటిల్లిపాది తరలివెళ్లి దేవతలకు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, బ్లాక్ అధ్యక్షుడు హమ్యానాయక్, రంగు మురళి, గోపాల్, సీతారామ్ నాయక్, వెంకన్న, దంతాపల్లి రవి, వెంకన్న, యాకన్న, జానీ, కర్ణాకర్, నరేష్, మోహన్‌రావు, రమేష్, ప్రవీణ్, పవన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండాయిలో గుడిమెలిగె పూజలు

12 నుంచి మినీ జాతర



వివరాలు వెల్లడిస్తున్న పూజారులు

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయి గ్రామంలో కొలువై ఉన్న గోవింద రాజులు, నాగులమ్మ, దొడ్ల గ్రామంలోని సారలమ్మ ఆలయాల వద్ద బుధవారం గుడి మెలిగె పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. గోవిందరాజుల గుడి వద్ద ఆలయ ప్రధాన పూజారులు దబ్బకట్ల గోవర్ధన్, రాజారాం, జనార్ధన్, నాగేశ్వరబాబు ఆధ్వర్యంలో జంపన్నవాగు నుంచి జలాన్ని తీసుకొచ్చి గుడిశుద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కొండాయి, దొడ్ల గ్రామాల్లో చేపట్టనున్న గుడిమెలిగె కార్యక్రమానికి భక్తులు, గ్రామస్థులు తరలిరావాలన్నారు. అలాగే ఈనెల 12నుంచి 15వరకు గ్రామాల్లోని గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ మినీ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. ఈనెల 12న గోవిందరాజుల గుడి నుంచి మినీ జాతర ప్రారంభమవుతుందని, భక్తులు తరలిరావాలని పూజారులు వెల్లడించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు లింగన్నగౌడ్

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కోసం గత సర్పంచ్‌లు చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు, వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచ్ శీలం లింగన్న గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో ముందస్తుగా ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్‌ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోలీసులు అదుపులోకి తీసుకున్న వెంకటాపురం మాజీ సర్పంచ్ లింగన్న



శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా సత్యవతి రాథోడ్

- స్పీకర్‌కు నిర్ణయ పత్రాన్ని అందించిన గులాబీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- నెల రోజుల్లో ముగియనున్న ఎమ్మెల్సీ పదవీకాలం
- విప్‌గా నియామకంతో మళ్లీ ఆమెకు ఎమ్మెల్సీ అవకాశంపై స్పష్టత

మహబూబాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. సత్యవతి రాథోడ్‌ను విప్‌గా నియమించేందుకు నిర్ణయపత్రాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంగళవారం అందించారు. మరోనెల రోజుల్లో ఆమె ఎమ్మెల్సీ పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ పార్టీ విప్ పదవికి ఎంపిక చేయడంతో.. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి సత్యవతిరాథోడ్‌కు అవకాశమివ్వబోతున్నట్లు స్పష్టమవుతోంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు శివారు పెద్దతండాకు చెందిన సత్యవతిరాథోడ్ 2009-2014 వరకు డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పని చేశారు. స్వరాష్ట్రం సిద్ధించాక 2018లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 2019లో సత్యవతిరాథోడ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ మంత్రి వర్గంలో స్త్రీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా, సంస్థాగత నిర్మాణ బాధ్యురాలిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణలో వివిధ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా ఎదిగిన ఆమెకు మంగళవారం శాసన మండలిలో బీఆర్ఎస్ విప్‌గా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా : సత్యవతిరాథోడ్

తనపై ఉంచిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజన మహిళనైన తనను గుర్తించి శాసనమండలి బీఆర్ఎస్ పార్టీ విప్‌గా అత్యున్నత పదవినందించిన రాష్ట్రసాధకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడతానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



శునకాలకు చర్మ వ్యాధులు

- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచారం
- తమకూ సోకుతుందన్న భయంలో ప్రజలు



గిరిపురంలో సంచరిస్తున్న చర్మవ్యాధి సోకిన ఓ శునకం

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధి కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఏ గల్లీకి వెళ్లినా వ్యాధి బారిన పడిన కుక్కలే దర్శనమిస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో మానవాళి మనుగడకు సైతం భారీ ప్రమాదం వాటిల్లే అవకాశాలున్నాయి. విచ్చలవిడిగా వ్యాధుల బారిన పడిన కుక్కలచే రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధప్రతిపాదికన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామ పంచాయతీల్లో అరకొరగా నిధులు ఉండడంతో పంచాయతీ కార్యదర్శులు సైతం చేతులెత్తేస్తు న్నారు. ప్రజలకు కుక్కల ద్వారా మరో ప్రమాదం ముంచుకొస్తుందనే ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు.

మరిపెడ మండల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీల పరిధిలో ఏ గ్రామంలోని ఏ వీధికి వెళ్లినా చర్మ వ్యాధుల బారిన పడిన వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. కుక్కల నివారణ చర్యలు తీసుకోవాల్సిన గ్రామ పంచాయతీ నిధుల కొరతతో సమస్యలను గాలికొదిలేస్తున్నారు. కుక్కల చర్మ వ్యాధుల ద్వారా ప్రజలకు ప్రమాదం జరుగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భయందోళన అవసరం లేదు

మనోహర్ కృష్ణకుమార్, పశు వైద్యాధికారి, ఎడ్జర్ల



చర్మవ్యాధుల బారిన పడ్డ వీధి కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహిస్తూ, నివారణకు ఐవర్ మెక్టిన్ మాత్రలు మూడు నుంచి నాలుగు వారాలు ఉపయోగిస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. గ్రామ ప్రజలు భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలి.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. యువ డాక్టర్ దుర్మరణం

- మృతుడు మానుకోట జిల్లా వాసి
- శనిగపురంలో విషాదఛాయలు





హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద శ్రీచరణ్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న మాజీ ఎంపీ కవిత, (ఇన్‌సెట్)లో శ్రీచరణ్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మేడ్చల్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురానికి చెందిన వైద్యుడు చుక్క శ్రీచరణ్ (28) మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..

శనిగపురం గ్రామానికి చెందిన చుక్క శ్రీను-వాణి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు శ్రీచరణ్ గత సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తి చేసి, మేడ్చల్ సమీపంలోని కిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. ఉదయం విధి నిర్వహణ కోసం ఆస్పత్రికి తన బైక్‌పై వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన భారీ కంటైనర్ శ్రీచరణ్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో శ్రీచరణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీచరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత గాంధీ ఆస్పత్రికి చేరుకుని శ్రీచరణ్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మాజీ వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు హైదరాబాద్‌కు చేరుకుని చుక్క శ్రీనును ఓదార్చి ధైర్యం చెప్పారు. కాగా, చేతికి అందివచ్చిన కుమారుడు శ్రీచరణ్ హఠాన్మరణంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

హెడ్‌కానిస్టేబుల్ మృతి బాధాకరం

డోర్నకల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సోమేశ్వర్ మృతి బాధాకరమని సీఐ రాజేష్‌నాయక్ అన్నారు. మంగళవారం డోర్నకల్‌లోని అశోక్‌భవన్‌లో విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో సోమేశ్వర్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజేష్ మాట్లాడుతూ.. హెడ్‌కానిస్టేబుల్ సోమేశ్వర్ అకాల మృతి తమను వేదనకు గురి చేసిందన్నారు. సోమేశ్వర్ విధి నిర్వహణ పట్ల నిబద్ధతతో పని చేసేవారని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కుందోజు లవణ్ కుమార్, బొమ్మన అశోక్‌కుమార్, కందుల మధు, గాజుల వేణు, వీరాచారి, ప్రభాకరాచారి, దామోదరాచారి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పను దర్శించిన ఇంగ్లండ్ దేశస్థులు



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఇంగ్లండ్ దేశస్థులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట లోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని మంగళవారం ఇంగ్లండ్ దేశానికి చెందిన కార్ల్, లిన్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపద, చరిత్ర గురించి గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ తూర్పు ముఖ ద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శిం చుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకు ని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించారు.

దేశగతిని మార్చే అద్భుతమైన బడ్జెట్

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్

పెద్దవంగర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశగతని మార్చే అద్భుతమైన బడ్జెట్ అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమైన చర్య అన్నారు. గత 75 సంవత్సరాల్లో మునుపెన్నడూ లేని విధంగా మధ్య తరగతి ప్రజలకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇది సంక్షేమ బడ్జెట్ అని పేద ప్రజల పెన్నిధిగా మోదీ మరోసారి నిరూపించుకున్నారు. దేశంలో 90 శాతం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను అభివృద్ధిని కాంక్షిస్తు రూపొందించిన బడ్జెట్ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులతో పోలిస్తే పది రెట్లు పెరిగాయని, దీనిని హర్షించాల్సిన ప్రతిపక్షాలు మోదీ దిష్టిబొమ్మ తగలపెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రచ్చ కుమార్, మాజీ ఎంపీటీసీ రహీమొద్దీన్, ఆనంద్, వెంకటనారాయణ, భాస్కర్, అన్వేష్ పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడారానికి ప్రత్యేక బస్సులు

- ఫిబ్రవరి 9 నుంచి హనుమకొండలో అందుబాటులో సర్వీసులు
- మహిళలకు ఉచితం : ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో జరిగే మినీ మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ మేడారం జాతర సందర్భంగా ఈనెల 9 నుంచి 16 వరకు 200 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు హనుమకొండ బస్టాండ్ ప్రాంగణం నుంచి ఉదయం 6 గంటల నుంచి మేడారానికి బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. 24 గంటల పాటు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లకుండా సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సమ్మక్క- సారలమ్మ దేవతల దర్శనం చేసుకోవాలని డి.విజయభాను తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ 9959226056లో సంప్రదించాలని ఆయన కోరారు.

లక్ష్మితండాలో ఒకరి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ శివారు లక్ష్మీతండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. లక్ష్మీతండాకు చెందిన నూనావత్ రమేష్ (35) తనకున్న రెండెకరాల భూమిలో వరిపంటను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నాలుగు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అతడిని గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలిస్తుండగా మార్గం మధ్య మృతి చెందాడు. మృతునికి భార్య సునీత, కుమార్తె విష్ణుప్రియ, కుమారుడు విష్ణు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బోడ సతీష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మహబూబాబాద్ మండలం ఉత్తరతండ శివారు రాయినికుంటలో మంగళవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఉత్తర తండాకు చెందిన బోడ సతీష్ (23) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన ఇంటి నిర్మాణం జరుగుతుండగా నీరు కొట్టేందుకు వెళ్లాడు. ఇంట్లోని ప్లగ్‌లో రెండు విద్యుత్ వైర్లు ప్లగ్‌లో అమర్చేక్రమంలో ఒకవైరు ఊడి సతీష్‌పై పడింది. దీంతో వెంటనే విద్యుదాఘాతానికి గురై సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య బిందు, నాలుగు నెలల కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి రాంసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు చెప్పారు.

రైస్‌మిల్లులో తనిఖీ

కేసముద్రం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో హరికృష్ణ ఇండస్ట్రీస్‌లో మంగళవారం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కృష్ణవేణి తనిఖీ చేశారు. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధానంలో ఈ వానాకాలంలో 4,496 టన్నుల ధాన్యం ఈ మిల్లుకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 3,012 టన్నుల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1537 టన్నులు బియ్యం సేకరించినట్లు తెలిపారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ సభ్యుడు చిదురాల వసంతరావు, మిల్లు యాజమాన్యం వోలం కృష్ణమూర్తి ఉన్నారు.

గడ్డివామి దగ్ధం



గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ శివారు లక్ష్మీతండాలో దారావత్ గొబ్రియాకు, నూనావత్ మోతీలాల్ చెందిన రెండెకరాల్లో వచ్చిన గడ్డివామి ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. విద్యుదాఘాతంతో గడ్డివాముకు నిప్పంటుకోగా స్థానికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా గడ్డివాము దగ్ధమైంది. దీంతో రూ. 30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పల్లికాయ (సూక)	6220	4600
పల్లికాయ (పచ్చిది)	4400	3100
కందులు	6750	5540
పెసళ్లు	6009	5133
పత్తి	6960	5800
వండర్‌హాట్	15000	11500
యూఎస్341	14200	11500
ఎల్లో మిర్చి	16000	13500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను ఉపయోగించుకోవాలి

ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజనలు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌ను ఉపయోగించుకోవాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ (39) బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్ శ్రీవాస్తవ్ ఆదేశాల మేరకు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సివిక్ యాక్షన్, 39 బెటాలియన్, సీఆర్పీఎఫ్ ఎంహెఎ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్పీ శివం ఉపాధ్యాయ హాజరై మాట్లాడుతూ.. గిరిజనలు స్వతహాగా జీవించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత గిరిజన ప్రజలకు సీఆర్పీఎఫ్ నిత్యం అండగా ఉంటుందని, ముఖ్యంగా గిరిజన యువత కోసమే ఈ ఉపాధి కల్పన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

అనంతరం ఏటూరు నాగారం డివిజన్ పరిధిలోని గిరిజనులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ద్వారా టైలరింగ్, డ్రైవింగ్‌తో పాటు వివిధ పరిశ్రమలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన వారికి ఏఎస్పీ, సీఆర్పీఎఫ్ (39) బెటాలియన్ కమాండెంట్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె తాజుద్దీన్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ కుమార్ శ్రీవాస్తవ్, చిత్రంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

మహా ఘట్టం.. ఎంతో ముఖ్యం


ఆలయ గోపురం వద్ద పనులు

కుంభాభిషేకంతో పెరగనున్న ఆలయమూర్తి తేజస్సు
7, 8, 9 తేదీల్లో కాళేశ్వరంలో జరిగే వేడుకకు ఏర్పాట్లు పూర్తి

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : 'శివం శాంతం.. జగన్నాథం.. లోకానుగ్రహకారణం.. శివమేకం.. పరంవందే శివోహం నమఃనమః'.. ప్రతీ పుష్కరానికోసారి మహాకుంభాభిషేకం చేస్తే ఆలయ తేజస్సు పెరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో కాళేశ్వర ఆలయ మహా కుంభాభిషేక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవతామూర్తి తేజోబింబం, యంత్రమూర్తి తేజస్సు పెరగడంతో భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయని పురాణాలు చెబుతున్నాయి. సప్త నదీ జలాలు తెచ్చి.. ఆలయమూర్తులకు, ఆలయ రాజగోపురానికి మంత్రయుక్తములతో కుంభాభిషేకం నిర్వహించనున్నారు. మహా కుంభాభిషేక ఘట్టం ఎంతో ప్రముఖమైందని.. దీని ద్వారా ఆలయ చరిత్ర మరింత పురోగమిస్తుందని.. ఆలయ ప్రాశస్త్యం పెరుగుతుందని పలువురు వేద పండితులు, అర్చకులు తెలుపుతున్నారు. 1982లో జగద్గురు ఆచార్యుల కరములచే మహా కుంభాభిషేక ఘట్టం జరిగింది. ఈ మహా కుంభాభిషేకంలో భాగంగా శతచండీయాగం, మహారుద్రాభిషేకం, శతఘటాభిషేకం, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగే మహా కుంభాభిషేక ఘట్టాన్ని మరింత వైభవంగా చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని అలయ అర్చకులు, అధికారులు కోరుతున్నారు.

1982లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగింది



1982లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగింది. ఈ సమయంలో ఫిబ్రవరి నెలలో మహా కుంభాభిషేకం నిర్వహించాం. 42 సంవత్సరాల ఈ కుంభాభిషేకాన్ని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించడం జరుగుతుంది. కుంభాభిషేకం ద్వారా ఆలయ మూర్తి తేజస్సు మరింత పెరుగనుంది. దీంతో భక్తుల కోర్కెలు తీరనున్నాయి. అప్పుగు జగద్గురు శంకాచార్యులు హాజరయ్యారు.

- త్రిపురారి కృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు

ఉత్సవమూర్తులను దర్శించుకుంటే పుణ్యం



మహాకుంభాభిషేకం తర్వాత ఉత్సవమూర్తులను దర్శించుకుంటే మహా పుణ్యం.. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలి. తుని తపోవనం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామివారు ముఖ్య అతిథులుగా రానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలై ఆదివారం వరకు జరుగనున్నాయి.

- నగేష్‌శర్మ, ఆలయ అర్చకుడు

ఏర్పాట్లు పూర్తి చేశాం..



మహాకుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వాములు గోపురం పైకి ఎక్కేందుకు పరంజాలు ఏర్పాటు చేశాం. విద్యుత్ లైట్లు, తాగునీటి వసతి, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు మెరుగుపరిచాం. ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు తరలిరావాలి. వేద పండితులు, కళశాలను సిద్ధం చేశాం.

- మహేష్, ఆలయ ఈవో, కాళేశ్వరం

ఆధ్యాత్మికం

వనదేవతల గుడుల్లో నేడు శుద్ధి పండుగ

12వ తేదీ నుంచి 15వరకు మినీజాతర

తాడ్వాయి, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): మేడారం మినీజాతరకు సమయం ఆసన్నమైంది. మినీజాతర ప్రారంభ సూచకంగా బుధవారం వనదేవతల గుడుల్లో శుద్ధి పండుగ నిర్వహించనున్నారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మల గుడుల్లో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం పూజారుల కుటుంబాలు వేకువజామున నిద్రలేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరిస్తారు. మేడారంలోని సమ్మక్క గుడిని, కన్నేపల్లి గ్రామాల్లో ఉన్న సారలమ్మ గుడిని శుద్ధి చేస్తారు. అనంతరం వనదేవతల ప్రతిమలు, మంగళహారతులతో పాటు వివిధ రకాల పూజాసామగ్రి, ప్రతిమలను బయటకు తీసి శుద్ధి చేస్తారు. గుడిలోపల దేవతల పీటలను పూజారుల కుటుంబాల మహిళలు అలుకువేసి ముగ్గులతో సుందరంగా అలంకరిస్తారు. ఈక్రమంలో పూజారులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాసామగ్రిని రహస్య పూజలకు సిద్ధం చేస్తారు. తదుపరి బుధవారం మినీ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సమాయత్తమవుతున్నారు.

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర వేడుకలు జరగనుండగా రహస్య పూజలు చేసి జాతరను కొనసాగిస్తారు. అయితే నేటి నుంచి జాతర వేడుకలు ప్రారంభంగా భావించి ఉపవాసాలతో, నియమనిష్టలతో పూజారులు దేవతలకు పూజలు చేస్తుంటారు. దీంతో జాతరలో శివసత్తుల పూనకాలు, డోలివాద్యాల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారులు కొక్కెర క్రిష్ణయ్య, కాక సారయ్య, ధూపదీప నైవేద్యాలకు దోబె నాగేశ్వరరావు, కాక భుజంగరావు, కేమ్ముపడ్డెలుగా సిద్దబోయిన స్వామి, సిద్దబోయిన జనార్దన్, సిద్దబోయిన నర్సింగరావు, సిద్దబోయిన వసతంరావు, రక్షకులుగా మునేందర్, పోలం వెంకన్న, పూజారుల సంఘం నాయకులు, సభ్యులుపలువురు పాల్గొనున్నారు.


మేడారంలో సమ్మక్క గుడి


కన్నేపల్లిలో సారలమ్మ గుడి

బయ్యక్కపేటలో మండెమెలిగే పండుగ

మండలంలోని బయ్యక్కపేటలో సమ్మక్క దేవత పూర్వీకులు మండే మెలిగే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈసందర్భంగా గ్రామంలో పుట్టుపూర్వం ఉన్న సమ్మక్కతల్లి గుడిని చెంద వంశీయులు శుద్ధిచేసి సమ్మక్క దేవతను ఆడబిడ్డగా కొలిచి పూజప్రతిమలను శుద్ధి చేస్తారు. అనంతరం ఆడబిడ్డలతో గుడిలో అలుకుపూతలు చేసి గుడికప్పులను సరిచేస్తారు. తల్లుల శక్తి పీఠాన్ని పూలతో అలంకరించి పసుపు, కుంకుమను సమర్పించి ధూపదీప నైవేద్యాలతో కొబ్బరికాయాలు కొట్టి, యాటమొక్కులు చెల్లించుకుంటారు. వచ్చేవారం జరుపుకొనే మినీజాతరలో ఎలాంటి అవాంతరాలు రాకుండా చూసుకోవాలని కోరుకుంటారు. జాతరకు సిద్ధమవుతున్నట్లుగా ఆడబిడ్డకు లాంఛనాలను సమర్పించి జాతరకు ముందు వారం నుంచి నియమనిష్టలతో పూజ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఈక్రమంలో బయ్యక్కపేటలో ఉన్న దేవతల గద్దెలను శుద్ధి చేసి పూజలు చేస్తారు. ఈకార్యక్రమంలో చెందవంశీయులు, కులపెద్దలు, గ్రామస్థులు పాల్గొంటారు.

కుంభాభిషేక పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వర కుంభాభిషేక వాల్ పోస్టర్లను కాళేశ్వర ఆలయ నిర్వాహకులు మంగళవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం కుంభాభిషేకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కొత్తలైన్లకు రెడ్‌సిగ్నల్!

(5వ పేజీ తరువాయి)

మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీ మార్గం అనుసంధానమవుతుంది. మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ప్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది. ఎంతో కీలకమైన ఈ రైల్వేలైన్‌కు బడ్జెట్‌లో చోటు దక్కకపోవటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్ కోసం రూ.5వేల కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగళూరు లైన్‌ను అనుసంధానం చేసేందుకు డోర్నకల్-గద్వాల లైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ఈ లైన్‌కు కూడా రెడ్ సిగ్నల్ పడింది. ఎంతో కీలకమైన ఈ నాలుగు లైన్లను పూర్తిచేసేందుకు ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలన్నారు.

కోచ్.. అమృత్ స్టేషన్లకు గ్రీన్‌సిగ్నల్

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మల్టిపుల్ రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కానీ దీని కోసం ఎన్ని నిధులు కేటాయించారో వెల్లడించలేదు. అయితే 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రూ.521కోట్లు కేటాయించారు. ఇప్పటికే 60శాతం వ్యాగన్ తయారీ పరిశ్రమ పనులు పూర్తి కావచ్చాయి. ఈ నేపథ్యంలో గత నవంబరులో వ్యాగన్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వ్యాగన్లతో పాటు రైల్‌కోచ్‌ల తయారీ, ఇతర రైల్వే అవసరాలకు కావాల్సిన యంత్రాల తయారీకి కాజీపేట జంక్షన్‌ను మల్టిపుల్‌గా వినియోగించుకోనున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న కాజీపేట, వరంగల్, జనగామ, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేశారు. ఈ స్టేషన్లను ఆధునికీకరించనున్నారు. ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నారు. రూ.20కోట్ల నుంచి రూ.35కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పటికే వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. అయితే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాజీపేట రైల్వే డివిజన్ హోదాపై మాత్రం రైల్వేశాఖ ఏలాంటి ప్రకటన చేయలేదు.

సాహితీ ప్రేమికుడు గుర్రపు

- రెండు దశాబ్దాలుగా పలు రచనలతో గుర్తింపు
- వ్యాపారంలో స్థిరపడినా.. సాహిత్యంపై తగ్గని ఆసక్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి దుస్తుల వ్యాపారం.. ప్రవృత్తి రచనలు చేయడం.. కవిగా, రచనా ప్రియుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు మానుకోటకు చెందిన గుర్రపు సత్యనారాయణ. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో 1967 జూలై 19న గుర్రపు నర్సయ్య, సారమ్మలకు మూడో సంతానంగా జన్మించిన ఆయన బాల్యమంతా ధర్మసాగర్‌లో గడిపారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ధర్మసాగర్‌లో చదివారు. ఆ తర్వాత తల్లిదండ్రులు వ్యాపార రీత్యా మహబూబాబాద్‌లో స్థిరపడడంతో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన ఆయన తండ్రి ద్వారా వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. ఇంటర్మీడియట్ నుంచే మినీ కవితలు రాయడం ప్రారంభించిన ఆయన రచనా వ్యాసంగం పై ఉన్న మక్కువతో తాను ప్రారంభించిన క్లాత్‌స్టోర్‌కు 'రచన' పేరు పెట్టుకోవడం ఆయనకు సాహిత్యం మీద ఉన్న ప్రేమను తెలియజేస్తోంది.

సాహితీ ప్రస్థానం ఇలా..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో 1991లో జరిగిన సాంస్కృతిక సమాఖ్య యువ సాహితీ వికాస వేదిక రాష్ట్ర రచయితల మహాసభలకు తొలిసారిగా వరంగల్ జిల్లా ప్రతినిధిగా గుర్రపు సత్యానారాయణ పాల్గొన్నారు. 1992 నుంచి 1994 వరకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర కమిటీలో సెక్రటేరియట్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. 1992లో అంతర్జాతీయ తెలుగు రైటర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందారు. 2007లో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు హాజరయ్యారు. విజయవాడలో 2009 జనవరిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సమాఖ్య ఎనిమిదో అంతర్జాతీయ మహాసభలకు హాజరయ్యారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడిగా, తెలంగాణ జాగృతి జిల్లా సాహిత్య విభాగంకన్వీనర్‌గా, శ్రీశ్రీ కళావేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, తెలుగు భాషా పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా, అఖిల భారత పద్మశాలి సంఘం సాహిత్య, సాంస్కృతిక విభాగం చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

సాహితీ రంగంలో గుర్తింపు..

గుర్రపు సత్యనారాయణ రెండు దశాబ్దాలుగా రచనలు రాస్తూ కవి, రచయితగా సాహితీ రంగంలో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారు. అంతే కాదు తన దుస్తుల షాపునకు కూడా రచన అని పేరు పెట్టి సాహితీరంగంపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రవృత్తిగా ఆయన అనేక కవితలు, కథలు, గేయాలు, పాటలు రచిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలపై స్పందిస్తున్నారు. గుడుంబా నిర్మూలనలో ప్రజలను చైతన్య పరచేందుకు 'లేవాలి.. నిద్రలేవాలి.. మహిళాలోకం అనే గేయాల సంకలనాన్ని రచించి ఆవిష్కరించారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహరావు జీవిత చరిత్రపై స్థితప్రజ్ఞుడు అనే పుస్తకాన్ని రాశారు. అంతేకాదు సాహిత్య ప్రక్రియల్లో పద్యం, నవల మినహా మిగతా అన్నిప్రక్రియలు మినీ కవితలు, కథ, గేయం, పాట, వ్యాసం, జీవిత చరిత్ర, సన్మాన పత్రాలు రాయడంలో ప్రావీణ్యముంది. ఆయన రాసిన ఎన్నో రచనలు ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో కూడా ప్రచురితమై ప్రజల ఆదరాభిమానాలు పొందాయి.


పీవీ నర్సింహరావు శతజయంత్యుత్సవాల్లో ఆయన జీవిత చరిత్ర స్థిత ప్రజ్ఞుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యవతిరాథోడ్, శంకర్‌నాయక్, మాజీ కలెక్టర్ వీపీ గౌతమ్ (ఫైల్)

అందుకున్న అవార్డులు, సత్కారాలు..

ఎక్స్‌రే ఉత్తమ కవిగా అవార్డు రూ.5వేల నగదు, కళా సాహితీ అవార్డు, రూ.3 వేల నగ దు, ఆంధ్రనాటక కళాసమితి అవార్డు, మట్టి కవితకు మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ అవార్డు, 2010లో రాష్ట్ర బెస్ట్ సిటిజన్ అవార్డు, 2012లో దాశరథి స్మారక పురస్కార అవార్డు (చెలిమి సాంస్కృతిక త్యాగరాయ గన సభలో, 2014లో తెలుగు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందుకున్నా రు. ఇక హైదరాబాద్ రవీంద్రభారతిలో కాన్సేక్లక్రితం అప్పటి సీఎం నారా చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమకవిగా, రచయితగా సన్మానం పొందారు. దివంగత మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని రచించినందుకు గాను హైదరాబాద్‌లో నాటి జమ్మూకశ్మీర్ గవర్నర్ కేవీ కృష్ణారావు నుంచి సన్మానం పొందారు. 2007లో తిరుపతిలో జరిగిన తెలుగు భాష బ్రహ్మోత్సవాల్లో, 2012 డిసెంబరులో తిరుపతిలో జరిగిన నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల్లో సత్కారాలు అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో విజయవాడలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.


భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ (ఫైల్)

రచనలకు మంచి గుర్తింపు..

సత్యనారాయణ తారణ, ఒక విజేత, విక్రమ, చిత్రభాను, ఊపిరి తదితర రచనలు చేయగా.. వాటికి మంచి గుర్తింపు వచ్చింది. మట్టి, మేలుకొలుపు, తదితర కవిత సంకలనాలు అందించారు. అభినందన చందనం, కల్యాణహారం, స్నేహశిఖరం, బ్యాలెట్ బ్యాలెట్, జయహో, రసగుళికలు మొదలగు గేయాలు రాసి పలువురి మన్ననలు పొందారు. అంతే కాకుండా దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ. నరసింహరావు జీవిత చరిత్ర, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై జయహో పేరుతో కవితా సంకలనం చేశారు.




వాకథాన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, ఎంపీ కడియం కావ్య

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్యాన్సర్‌ను జయించా..

అందరూ అవగాహన పెంపొందించుకోవాలి

- ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి
- 'వాకథాన్'లో సినీ నటి గౌతమి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గౌతమి, చిత్రంలో ఎంపీ కావ్య తదితరులు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తాను క్యాన్సర్ బారిన పడినప్పుడు.. భయపడకుండా.. దాన్ని జయించానని, అందరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సినీనటి గౌతమి పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సుమారు రెండువేల మందితో వాకథాన్ నిర్వహించారు. అనంతరం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో గౌతమి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్యాన్సర్ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి మహమ్మారిని నాశనం చేయాలన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అనేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరమన్నా రు. గతంలో క్యాన్సర్ అంటే భయపడేవార ని, తనకు 32 రెండేళ్ల వయస్సులో క్యాన్సర్ వచ్చినా భయపడలేదన్నారు. సమాజంలో అవగాహన కల్పించాలని, క్యాన్సర్‌ను జయించి వచ్చానని పేర్కొన్నారు. తాను క్యాన్సర్ బారిన పడినప్పుడు చిన్న పాప ఉండేదని, పరీక్షలు చేసి చెప్పడానికి కూడా డాక్టర్లు చాలా బాధపడ్డారని గుర్తు చేశారు. ఇది తనకు మరో జన్మ అని అందరితోపాటు మూడు కిలోమీటర్లు నడిచానని తెలిపారు. ధూమపానం, మద్యపానం, పాన్, గుట్కా తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా క్యాన్సర్ రోగులకు పోషక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గౌతమి కోరారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల్లో సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ యాక్సిడెంట్ లాంటిందని అభిప్రాయపడ్డారు.

క్యాన్సర్ చికిత్స ఖర్చుతో కూడుకున్న వైద్యం అయినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ చికిత్స కోసం మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ హరిణి బోయినపల్లి, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య విద్యా సంస్థల, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


కాళోజీ కళాక్షేత్రంలో అవగాహన సదస్సుకు హాజరైన వారు

ఆంధ్రజ్యోతి



ములుగు

బుధవారం 5 ఫిబ్రవరి 2025



పీహెచ్‌సీ తనిఖీలో పాల్గొన్న అధికారులు

పీహెచ్‌సీలో ఎన్‌హెచ్‌ఎం తనిఖీలు

తాడ్వాయి, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి) : తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా తాడ్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మేడారంలోని ఆయూష్‌మాన్ భారత్ మందిర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురుగన్, సెంథిల్, టీబీ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ చంద్రకాంత్, మెడికల్ ఆఫీసర్ చిరంజీవి, పీహెచ్ఎన్ మెర్సీమణి, ఎచ్‌వీ సమ్మయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, ఎల్‌టి రజిత, ఫార్మసిస్టు కిరణ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు జీపీల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ స్పెషల్ డ్రైవ్

కాటారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చిదినేపల్లి, ప్రతాపగిరి, కొత్తపల్లి, ఇబ్రహీంపల్లి, చింతకాని గ్రామపంచాయతీల పరిధిలో మంగళవారం ఎంపీవో వీరస్వామి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో కలిసి తాగునీటి సరఫరా చేసే బోర్‌వెల్స్, చేతిపంపులు, ఓహెచ్ఎస్ఆర్‌లు, పైప్‌లైన్లను పరిశీలించారు. నీటి వనరులు, తాగునీటిసరఫరా తీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా జీపీ కార్యదర్శులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి వెంటనే తీసుకుని వచ్చి పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య, దేవేందర్, శేఖర్, నాగరాజు, జ్యోత్స్న జీపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

వాజేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో మిషన్ భగీరథ పైపులను తీసి మరల కొత్త స్థానంలో ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో 12 గ్రామ పంచాయతీలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో మంగళవారం మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం మండలంలోని జగన్నాథపురంలో పర్యటించి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న సమయంలో కాకా మిగతా సమయాలలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన సూచించారు. పైప్‌లైన్‌లు ఎక్కడ వరకు పూర్తి అవుతాయే అక్కడ నుంచి మరల నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పునరుద్ధించాలని అధికారులకు సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా ప్రజలకు తాగునీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏఈ శైలజ, ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

మల్హర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని డీఈ రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తాడిచర్లలో తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. గ్రామంలోని పైప్‌లైన్, ట్యాంకులను పరిశీలించారు. సమస్య ఉంటే తనకు తెలపాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ హరిత, జీపీ సిబ్బంది ఉన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కాటారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూముల ఆక్రమణదారులు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని యూవైఎఫ్ఐ (అఖిల భారత ఐక్య యువజన సమాఖ్య)రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల పరిధిలో వ్యాపారులు, ఉద్యోగులు లావణీపట్టా, అసైన్డ్ భూములను కొనుగోలు చేసి అక్రమంగా ఇళ్లు, వ్యాపార సముదాయాలు కడుతుంటే వారికి అధికారులు వంత పాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలుగా ఇచ్చి ఇండ్లు నిర్మించాలన్నారు. అక్రమంగా ప్రభుత్వ భూములను కాజేసిన వ్యాపారులు, ఉద్యోగులపై, సహకరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యం పోచయ్య ఉన్నారు.

చైల్డ్ లిట్రసీ సెంటర్ ప్రారంభం

వాజేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగారం స్కూల్‌లో మంగళవారం ఎంఈవో వెంకటేశ్వర్లు చైల్డ్ లిట్రసీ సెంటర్‌ను ప్రారంభించారు. చైల్డ్ ఫర్ ఇండియా అనే ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ లిట్రసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కావాలిసిన ఆట వస్తువులు, పాఠ్యపుస్తకాలను ఎన్జీవో సంస్థ అందించింది. అదే విధంగా ఈ ఎన్జీవో తరపును ఒక విద్యావలంటీర్‌ను సైతం సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓలం ఫుడ్ ఇంగ్రిడియన్స్ వారి సహకరంతో పనిచేసే చైల్డ్ ఫర్ ఇండియా సంస్థను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎన్జీవో సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ ఎన్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు మనోజ్, శిరిష తదితరులు ఉన్నారు.

సీతారామాంజనేయ ఆలయ వార్షికోత్సవం

మంగపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బోరునర్సాపురంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానం 18వ, వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మూల విరాట్‌లకు అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈనెల 7 వరకు జరుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జిడికంటి రంగాచార్యులు జిడికంటి కృష్ణప్రసాద్ చార్యులు, పరంకుశం కృష్ణామాచార్యులు, పరంకుశం వేణుమాదవచార్యులు, ఫణికుమార్, దేవస్థానం ఛైర్మన్ నర్రా శ్రీధర్, కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్ వద్ద పారిశుధ్య పనులు

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ఉన్న గోదావరి పుష్కరఘాట్ వద్ద మంగళవారం పారిశుధ్య సిబ్బంది ముమ్మర పనులు చేపట్టారు. కుంభాభిషేకానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున స్పెషల్ అధికారుల ఆదేశాల మేరకు గోదావరి వద్ద శుభ్రం చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

సీసీపీఎల్ నూతన కమిటీ ఎన్నిక

చిట్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిట్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ మూడో సీజన్ నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇరుకులపాటి వినయ్‌చౌదరి, ప్రధాన కార్యదర్శిగా మాటూరి లవన్‌బాబు, ఉపాధ్యక్షులుగా బైరం శివ, గడ్డం సాయి నితిన్, కోశాధికారిగా వేల్పుల రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా చిలుముల శ్రీనివాస్, సరిగొమ్ముల అజయ్ ఎన్నికయ్యారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదలకు ప్రయోజనం



ములుగులో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాం

ప్రధాని, ఆర్థిక మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ములుగు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా, పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టిందని, గతంతో పోల్చుకుంటే తెలంగాణకు ఎక్కువ ప్రయోజనం కలిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మంగళవారం ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం, ప్రసాద్ పథకం కింద రామప్ప ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించబడ్డాయన్నారు. మేడారం జాతర అభివృద్ధి కోసం రూ.21కోట్లు కేటాయించారని తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన బలరాం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా నియమితుడైన భూక్యా జవహర్‌లాల్‌ను పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రాచారి, ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, కార్యదర్శి శ్రీనివాసరావు, ములుగు మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, నాయకులు గంగిశెట్టి రాజ్‌కుమార్, రవిరెడ్డి, సునిల్, వెంకట్‌రెడ్డి, మహేందర్, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు ధన్యవాదాలు తెలుపుతూ మండలంలోని పస్రాలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్త సుధాకర్‌రెడ్డి, మెరుగు సత్యనారాయణ, ఏదునూరి రమేష్, సోమిరెడ్డి, యార్లగడ్డ నాగేశ్వర్‌రావు, గణేష్, గజ్జి కుమార్, ఆకుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ ప్రవేశపెట్టిన పేద, మధ్యతరగతి యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని, బీజేపీ మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాలరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బడ్జెట్ సందర్భంగా మండలకేంద్రంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోరె రవీందర్‌రెడ్డి, చెవ్వ శేషగిరి, కుమ్మరి లచ్చమ్మ, బండారి శ్రీనివాస్, రవీందర్, పులి వెంకటరెడ్డి, వేముల రాజయ్య, బత్తిని శ్రీధర్, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకుల సుద్దాల వెంకన్న, మండల మొగిలి, గుండ సురేష్, శ్రీనివాస్, మైదం శ్రీకాంత్, మహేష్, ర్యాకం శ్రావణ్ పాల్గొన్నారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● **జిల్లా మేనేజర్ నరేష్**

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా నూతనంగా మంజూరైన 108వాహనాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 108 జిల్లా మేనేజర్ నరేష్ కోరారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ నాగరాణి అధ్యక్షతన ఆశా వర్కర్లకు 108 సేవలపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆశాలకు కేటాయించిన టార్గెట్స్‌ను పూర్తిచేయాలని, ప్రజలకు పూర్తిగా సహకరించి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఈ సదస్సులో ఎంఎల్‌హెచ్‌పీ సూపర్‌వైజర్లు, 108సిబ్బంది కటుకూరి శ్రీనివాస్, బండి సురేష్, శిలపాక రాజు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవాలయంలోని అనుబంధ దేవాలయమైన సూర్యాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితులు, అర్చకులు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు వేద మంత్రాలతో సూర్యాలయంలో సుబ్రహ్మణ్యస్వామికి పలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వర గ్రామస్థులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

● వాజేడు: మండలంలో రథసప్తమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజామునే లేచి గంగస్నానం ఆచరించి సూర్యభగవానుడకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరగాయలతో చేసిన రథం, పిడకల మీద పాలు పొంగించి, చెరుకు గడలతో, ఆవు పాలతో సూర్యుడికి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మల్లేశం తెలిపారు. ఈమేరకు మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ (ఐఏసీఈ) వారి సహకారంతో కళాశాల కెరీర్‌గైడెన్స్ సెల్ కన్వీనర్ డి.రాధిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కరెంట్ అఫైర్స్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.. కళాశాలలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు పూర్తి స్థాయిలో గైడెన్స్ ఇవ్వడానికి అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, అన్ని పుస్తకాలు లభించే గ్రంథాలయం తోడ్పడుతుందని అన్నారు. ఐఏసీఈ రిసోర్స్‌పర్సన్ డి.మహిత మాట్లాడుతూ విద్యార్థులకు చేయూతనందించా లనే ఉద్దేశంతో పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ బి.బాలయ్య, అకాడమి కోఆర్డినేటర్ సీహెచ్.భాస్కర్, టీఎస్‌కేసీ కన్వీనర్ కవిత, అధ్యాపకులు సరిత, శిరీష, రాధిక, అనిల్‌కుమార్, జగదీశ్, ఉదయశ్రీ, విజిత, తేజోలత, మౌలానా, అనిత, నవీన్, ఐలయ్య, లక్ష్మి, షరీఫా, రమేష్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాడ్రమ్ములను చూపుతున్న అధికారులు

గుడుంబా తయారీ, అమ్మకాలు మానేయాలి


ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారీ, అమ్మకాలు మానుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని పెద్దకుంటపల్లి, గొర్లవీడు, గుడాడ్‌పల్లి గ్రామాలోని నాటు సారాయి స్థావరాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. మొత్తంగా 6 కేసులు నమోదు చేసి.. ఆరుగురు నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 40 లీటర్ల నాటుసారాయి, 20 కేజీల చెక్కర, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని 1750 లీటర్ల చెక్కర పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. అనేకమార్లు తయారీ అమ్మకందారులను హెచ్చరించినా మార్పు రావడం లేదని, దాడుల్లో పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ ప్రదీప్‌రావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగాచారి, ఎక్సైజ్ సీఐ రమ్య, ఎక్సైజ్ ఎస్సై రబ్బానితో పాటు ఎక్సైజ్, డీటీఎఫ్ సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

150 లీటర్ల సారా పట్టివేత

వాజేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం 150 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారుజ. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ పరిధిలోని అయ్యవారిపేటలో మంగళవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో జనగం వెంకటరమణ ఇంట్లో తనిఖీ చేయగా నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీలలో హెచ్‌సీ సంతోష్, పీసీలు సత్యాన్వేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి కన్నుమూత



సత్యం (ఫైల్)

మంగపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వాడగూడెం గ్రామపంచాయతీ పరిధి పాలాయిగూడెంనకు చెందిన శతాధిక వృద్ధుడు తోట సత్యం (103) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాలాయిగూడెంనకు చెందిన మంగపేట సహకార సంఘం ఛైర్మన్ తోట రమేష్‌కు చిన్నతాతైన తోట సత్యం కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన తీవ్ర అస్వస్థతకు లోనుకాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేలమట్టమైన పూరిల్లు



గాలికి కూలిన పూరిల్లు

మంగపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రమణక్కపేటకు చెందిన ఇల్లందుల సమ్మయ్య- రామక్క దంపతుల పూరిల్లు మంగళవారం తెల్లవారు జామున నేలమట్టమైంది. లోతట్టులో ఉన్న ఈ పూరిల్లు సుడిగాలి ఒక్కసారిగా వీయడంతో నేలమట్టమైంది. ఇంటిలో గల సుమారు రూ, 50 వేల విలువైన సామాగ్రి ధ్వంసమైందని బాధితులు తెలిపారు. పూరి గుడిసెల కూలడంతో తాము రోడ్డున పడ్డామని రామక్క కన్నీటి పర్యాంతమైంది.

వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచనలు పాటించాలి

కాటారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాలను రైతులు వీక్షించి వ్యవసాయశాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు పొందాలని మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ అన్నారు. మండలకేంద్రంలోని కాటారం క్లస్టర్ రైతువేదికలో మంగళవారం రైతులతో కలిసి ఏడీఏ, కాటారం, మహాముత్తారం మండలాల వ్యవసాయాధికారులు రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. అడవిపందుల దాడి-పంటల రక్షణ మార్గాలు, మిర్చి పంటలో తెగుళ్ల-నివారణ చర్యలు అనే అంశాలపై ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ పీ సునిత, డాక్టర్ హేమంత్ వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీపాల్, కాటారం, మహాముత్తారం ఎంఏవోలు పూర్ణిమ, అనూష, ఏఈవోలు రాజన్న, సరిత, ఆస్మా, దివ్యజ్యోతి, దీపక్, శివకృష్ణ, శశివర్ధన్, ప్రవళిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న రైతులు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి పెద్దవాగులో జరుగుతున్న అక్రమ ఇసుకదందాను స్థానిక గ్రామస్థులు, రైతులు మంగళవారం అడ్డుకున్నారు. పెద్దవాగు నుంచి గత కొన్నినెలల నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా వరంగల్ జిల్లా నడికూడ మండలం వరికోలు గ్రామానికి చెందిన కొంత మంది ట్రాక్టర్ల యజమానులు ఇసుకను పరకాల, వరంగల్, నడికుడ, కమలాపురం, తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో వాగులో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎత్తివేయడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలుమార్లు పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం అందించినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. కాగా, మంగళవారం ఉదయం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై రైతులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు హుటాహుటిన సంఘటన ప్రాంతానికి చేరుకుని ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వేములపల్లి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇతర జిల్లాలకు రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులపై వాటా చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

సీడీపీవో ఆత్మహత్యాయత్నం

● కలెక్టర్ సస్పెండ్ చేయడంతో మనస్తాపం!

● ప్రాణాపాయం లేదన్న వైద్యులు

వెంకటాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం (నూగూరు) ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ధనలక్ష్మి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ములుగు జిల్లాలో సంచలనమైంది. తనపై ఉన్నతాధికారులు ఇచ్చిన తప్పుడు సమాచారంతో కలెక్టర్ తనను సోమవారం సస్పెండ్ చేశారన్న మనస్తాపంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఆమె మంగళవారం ఉదయం చేతి మణికట్టుపై కత్తితో కోసుకున్నారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి.. అపస్మారకస్థితిలోకి వెళ్లారు. ఉదయాన్నే ఆమెను విధులకు తీసుకెళ్లేందుకు వచ్చిన కారు డ్రైవర్ గమనించి హుటాహుటిన వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. వెంటనే చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఈక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని సీడీపీవో ధనలక్ష్మి ఆరోపణలు చేశారు. తనపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ తనను సస్పెండ్ చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాల గురించి తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా సంక్షేమ అధికారి తనపై కక్షగట్టి అంగన్‌వాడీ టీచర్లకు లేనిపోని మాటలు చెప్పి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేలా ఉసిగొల్పారని వాపోయారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేనప్పటికీ అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు నడుస్తున్నాయని, వాటికి కిరాయి చెల్లించేలా బిల్లులు మంజూరయ్యాయని, ఈక్రమంలోనే తాను ప్రశ్నించడంతో డీడబ్ల్యూవో తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మీడియాకు తెలిపారు. సీడీపీవో ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై వెంకటాపురం వైద్యాధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. మణికట్టు నుంచి తీవ్ర రక్తస్రావం జరిగినట్టు గుర్తించామని, నరాలు, కండరాలకు ఎలాంటి హాని కలుగకపోవడంతో ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారి తేజ తెలిపారు. ఆమె ఇన్‌చార్జ్ సీడీపీవోగా గతేడాది నవంబరులో విధుల్లో చేరారు. ఈక్రమంలో వాజేడు, వెంకటాపురం మండలాల్లో అంగన్‌వాడీల జీతాలు, అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లీజు చెల్లింపులపై ప్రశ్నించడం, అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారి నుంచి తనకు ఎలాంటి సపోర్టు లేదని ఆమె చెబుతున్నారు. కాగా, ధనలక్ష్మి ఆత్మహత్యాయత్నంపై ములుగు కలెక్టర్ దివాకర ఆరా తీసినట్టు సమాచారం.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రేగొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. నాగుర్లపల్లికి చెందిన భూపతిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన నర్ర సమ్మిరెడ్డి తల్లి మల్లక్క మృతి చెందగా నివాళులు అర్పించి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ పాపిరెడ్డి, రేగొండ టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, నాగుర్లపల్లి గ్రామ శాఖ బీఆర్ఎస్ అధ్యక్షుడు అంకూస్ పాల్గొన్నారు.

పేదల అమాయకత్వమే ఆసరాగా..

(5వ పేజీ తరువాయి)

మందులు ఇచ్చారో వివరంగా రశీదు ఇవ్వాలి. కానీ, చాలా వరకు మెడికల్ షాపుల్లో ఇవేమి అమలు కావడం లేదు. అడిగేవారే లేకపోవడంతో ధరలను సైతం ఇష్టానుసారంగా తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఏదేని మందులపై అదనంగా రూ.25 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొరవడిన నిఘా.?

గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్‌షాపులపై గానీ, ఆర్ఎంపీలపై గానీ వైద్యాధికారుల నిఘా కొరవడింది. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 240 గ్రామ పంచాయితీలుంటే.. ఒక్కో గ్రామంలో కనీసం ముగ్గురు నుంచి ఐదుగురు ఆర్ఎంపీలు ఉన్నారు. గతంలో ఎన్నడూ వీరిపై తనిఖీలు జరిగిన దాఖలాలు గానీ, చర్యలు తీసుకున్నా పరిస్థితులు గానీ జిల్లాలో ఎక్కడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైద్యాధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్న సైతం ఉత్పన్నమవుతోంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ గానీ, వైద్యఆరోగ్యశాఖ గానీ దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటే గానీ నిరుపేదలకు భారం తప్పదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

పంచాయతీ ఎన్నికలపై సమన్వయ సమావేశం

వాజేడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో విజయ, తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శ్రీకాంత్ నాయుడులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 17 జీపీలను నాలుగు క్లస్టర్‌లుగా విభజించారు. క్లస్టర్‌ల వారీగా ఓటర్ల వివరాలను, పోలింగ్ బూత్‌ల సంఖ్యలపై చర్చించారు. ఎన్నికల సమయంలో తీసుకునే విధానాలపై మాట్లాడారు. ఆర్ఐ కుమారస్వామి ఉన్నారు.

● గోవిందరావుపేట: గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండడంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, పస్రా ఎస్సై కమలాకర్, ఎంపీవో శరత్‌బాబు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహదేవపూర్: రాన్నున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో వివిధరాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడారు. పార్టీల నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమకు రెండు మూడు రోజుల్లో తెలియజేయాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కాటారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కాటారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో వివిధ కేసుల సందర్భంగా పట్టుబడ్డ వాహనాలను బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్న ట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9 ద్విచక్ర వాహనాలకు వేలం జరుగుతుందని తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగానే వాహనాలను చూసుకుని అప్‌సెట్ ధరను చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆ ప్రకటనలో తెలిపారు.